
# గుడ్డిపూలు

మనోప్రియ

ఎగువన వర్షాలు మొదలయ్యాయి. బేరేజి నిండింది. వర్షం క్రమంగా వరద అవుతోంది.

సికిందరాబాద్ స్టేషన్‌లో అంత వర్షం లేదు. చినుకులు పడుతున్నాయి. ఆగిపోతున్నాయి. మళ్లీ పడుతున్నాయి, ఎనిమిదీ నలభయికి బయల్దేరాల్సిన బండి పదకొండున్నరకేమో అయిష్టంగా బయల్దేరింది.

వాతావరణ సూచన ప్రకారం బంగాళాఖాతంలో వాయుగుండం బలపడుతోంది. పుదుచ్చేరి, తమిళనాడు, ఆంధ్ర, ఒరిస్సాలో ఏ తీరాన్నయినా తాకవచ్చు, లేదూ బలహీనపడిపోవచ్చు.



రైలు వేగం పుంజుకుంది. వాతావరణం అనుకూలంగా లేకపోయినా బండి నిండుగా ఉంది. లిస్టుల ప్రకారం ఏ సీటూ ఖాళీగా లేకపోయినా పెట్టగలిగినవాళ్లకు బెర్తులు దొరుకుతున్నాయి. లయిను బావున్నట్టు మధ్య మధ్యలో విజిలు శబ్దాలు వినిపిస్తున్నాయి.

ఈరారానికి ముప్పు వచ్చింది. ఎగువ నుండి వచ్చే నీటికి చెరువు నిండుతోంది. రెండు వేల గడపల ఊరు. అన్ని సదుపాయాలున్నాయి. ఈరారం పక్కగా రైలు వంతెన ఈ మధ్యనే కట్టారు. అది కట్టడానికి పదేళ్లు పట్టింది. ఆ ఊళ్లో పాసింజరు బండ్లు కూడా ఆగవు. ఎర్రబస్సులే శరణ్యం. ఎప్పుడు వస్తుంటాయో, ఎప్పుడు వెళ్తుంటాయో తెలియదు. ఉన్నవాళ్లు తమ కార్లుకోసం, నది నుండి ఇసుక తీసే లారీల కోసం మంచి రోడ్లే వేయించుకున్నారు.

ఈరారానికి పక్కనే ఉన్న నర్సాయిపేట చాలా ఎత్తులో ఉంది. అది ఏనాడూ ముంపుకు గురికాలేదు. చుట్టుపక్కల ఊళ్లు మునిగినా నర్సాయిపేట తడవదు. కొన్ని ప్రదేశాలు అంతే.

వాయుగుండం నెల్లూరుకు అవతల వంద కిలోమీటర్ల దూరంలో నిలబడిపోయింది. ఉత్తరం పోదు. దక్షిణం పోదు. అటుచేసి ఇటుచేసి ఎటు కొడుతుందో తెలియకుండా ఉంది.

ఈరారం చెరువు నిండింది. గత అయిదు సంవత్సరాలలో అంతగా ఎప్పుడూ నిండలేదు. ప్రమాద స్థాయికి వస్తున్నట్టే ఉంది. ఊరి పెద్దలకు భయం పట్టుకుంది. వరద ఉధృతం అయితే చేతికొచ్చిన పంటలు నాశనమవుతాయి. ఈసరికే అవి జరిగాయి. రెండు నెలలకొకసారి రోడ్లు బాగు చేస్తున్నా అవీ దెబ్బ తింటూ ఉంటాయి. ఈసారి ఊరు ఊరే మునిగిపోయేట్టుంది.

"ఏం చేద్దాం?"

తలో మాట చెప్పారు.

ఏ మాట ఎవరికీ నచ్చలేదు.

చివరికి ఒకతను అన్నాడు, "చెరువుకు గండి కొడదాం."

"ఊళ్లోకి నీళ్లు వస్తాయిరా."

"తూర్పుకు కాదు. పడమరకు."

గంట తర్జన భర్జనలు జరిగాక పదిమంది యువకులు పడమర వయిపు గండి పెట్టారు. నీళ్లు కదిలి ఈరారానికి అటుపక్క ఉన్న కృష్ణ వాగులోకి వెళ్లిపోయాయి.

సారూ, ఈరారం బతికింది. ఒక్క మనిషికి కూడా ఏ ఆపదా కలగలేదు. వంతెన వరకు వచ్చి పట్టాలు తప్పిన రైలు బండికి కూడా ఏం కాలేదు. నలుగురు ప్రయాణీకులకేమో చిన్న దెబ్బలు తగిలాయని, వాళ్లను వెంటనే దగ్గర్లో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని, వాళ్లు కోలుకుంటున్నారని కుల టివీల్లో వార్తల మీద విరిగిపోయే వార్తలు, (స్క్రోలింగులు, ఓహ్... మూకుమ్మడి మానభంగాల్లా వచ్చాయి. ఈరారం ఊరిపెద్దల ఇంటర్‌వ్యూలు తీసుకుని ప్రశంసలు పదే పదే ప్రసారం చేశారు.

అయితే- పడమర వయిపు పెట్టిన గండికి నలభయి అయిదుమంది వరదల్లో కొట్టుకుపోయారని, వాళ్లు మాదిగపల్లె నివాసులని కనీసం ఒక్కటంటే ఒక్క మీడియాలో కూడా రాలేదు. వాటిల్లో వాళ్లు ఎక్కడున్నారని? వాళ్లూ మనుషులని ఎవరికీ అనిపించలేదా? టి.విలకు ప్రయిజులొచ్చాయని, ఎవార్డులు వచ్చాయని డప్పులు కొట్టుకోవడం సంపెంగెపూలు మడిచిపెట్టుకున్నట్టు కాదా?

## రచయితలకు సూచనలు!

* మీ రచనలను కాగితాలకు ఒకవైపున మాత్రమే రాయాలి.
* జిరాక్స్ కాపీలను పరిశీలనకు స్వీకరించలేం.
* మీ రచనతోపాటు పూర్తి అడ్రసు రాయాలి. పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరిగా ఉండాలి.
* అనువాద రచనలకి మూల రచయిత అనుమతి పత్రం జతచేయాలి.
* మీ రచన ఇదివరకు ఎప్పుడూ, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదన్న హామీపత్రం జతపరచాలి.
* ప్రచురించని రచనల్ని తిరిగి పొందాలనుకునేవారు తగినంత పోస్టేజీ స్టాంపులు అంటించిన సెల్ఫ్ అడ్రసు కవరు విధిగా జతపరచాలి.
* రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్‌లో ఎలాంటి సంప్రదింపులకు తావులేదు.
* ఆరోగ్యకరమయిన హాస్య, వ్యంగ్య రచనలకి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది.
* మీ రచనలు పంపించవలసిన చిరునామా:

ఆదివారం వార్త
ఎడిటర్
'వార్త' తెలుగు దినపత్రిక
లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్ - 500 080